


బాలానగర్ వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన చిన్నారి

జాతీయ రహదారిపై..

ట్రామాకేర్ సెంటర్లు

- సీఎం, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సమావేశంలో నిర్ణయం
- బాలానగర్ ప్రమాద ఘటనపై ఆరా తీసిన ముఖ్యమంత్రి
- బాలానగర్, జడ్చర్ల, జానంపేట, ఎర్రవెల్లి వద్ద ఏర్పాటయ్యే అవకాశం
- ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు హైవేపై ఎక్కడా లేని సెంటర్లు
- ప్రమాదాల్లో ఏడాదిలో 16 మంది మృతి.. 35 మంది క్షతగాత్రులు
- ట్రామాకేర్ సెంటర్లు ఉంటే ప్రాణాలు నిలిచేవనే అభిప్రాయం




44వ నంబర్ జాతీయ రహదారి

మహబూబ్‌నగర్, జనవరి 10(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి జిల్లాలోని 44వ జాతీయ రహదారి పక్కన ట్రామాకేర్ సెంటర్ల ఏర్పాటుకు రంగం సిద్ధమవుతోంది. ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహ, మంత్రి జూపల్లి కృష్ణారావు తాజాగా ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలతో నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల బాలానగర్ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాద ఘటన నేపథ్యంలో.. ఎమ్మెల్యేలు అనిరుధ్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి కోరిన మేరకు సీఎం, మంత్రులు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. జాతీయ రహదారిపై ఎక్కడ ప్రమాదం జరిగినా పది నిమిషాల్లోపే ఆస్పత్రికి చేరేలా ట్రామా కేర్ సెంటర్లను ఏర్పాటు చేయాలని, ఇందుకోసం చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఎమ్మెల్యేలకు సీఎం, మంత్రి హామీ ఇచ్చారు.

30-40 కిలోమీటర్ల పరిధిలో ఒక సెంటరు ఉండాలి

ప్రభుత్వ అధ్యయనాల మేరకు కనీసం 60 కిలో మీటర్లకు ఒక ట్రామాకేర్ ఉండాలని సూచనలున్నాయి. అయితే ఇక్కడున్న ప్రత్యేక పరిస్థితులు, రద్దీ, ప్రమాదాలు జరిగినప్పుడు తీవ్రత, జాతీయ రహదారితో పాటు సమాంతరంగా ఆయా కేంద్రాలకు రాష్ట్ర రహదారులూ అనసంధానమై ఉండటం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని కనీసం 30 నుంచి 40 కిలోమీటర్ల పరిధిలో ఒక ట్రామాకేర్ ఏర్పాటు చేస్తే ఉపయుక్తంగా ఉంటుందని ఎమ్మెల్యేలు, వైద్యులు చెబుతున్నారు.


బాలానగర్ పీహెచ్‌సీ

ఏడాదిలో పదహారు మరణాలు

మహబూబ్‌నగర్, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల పరిధిలో బాలానగర్ నుంచి పుల్లూరు టోల్ ప్లాజా వరకు సుమారు 220 కిలో మీటర్ల పొడవున 44వ నెంబర్ జాతీయ రహదారి ఉంది. ఈ పరిధిలో అత్యవసర సమయాల్లో ప్రమాద బాధితులకు వైద్యం అందించే ట్రామాకేర్ సెంటర్ ఒక్కటీ లేకపోవడంతో ఏటా పదుల సంఖ్యలో మరణాలు సంభవిస్తున్నాయి. పుల్లూరు నుంచి పెబ్బేరు వరకు ప్రమాదాలు జరిగితే అటు కర్నూల్‌కు, రాజాపూర్ నుంచి బాలానగర్ వరకు ప్రమాదాలు జరిగితే ఇటు మహబూబ్‌నగర్‌కు, అటు హైదరాబాద్‌కు తీసుకెళ్తున్నారు. మధ్యలో జడ్చర్ల నుంచి కొత్తకోట వరకు ఎక్కడ ప్రమాదాలు జరిగినా మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి తరలిస్తున్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు దాని తీవ్రతను బట్టి ఐదు నుంచి పది నిమిషాల్లోపు బాధితులకు సరైన వైద్యం అందితే ప్రాణాలతో బయటపడవచ్చని అనేక అధ్యయనాలు, నివేదికలు తేల్చిచెప్పాయి. ఈ నివేదికల ఆధారంగానే ప్రభుత్వం జాతీయ రహదారులపై ప్రతీ 60 కిలోమీటర్ల పరిధిలో ఒక ట్రామాకేర్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని వైద్య, ఆరోగ్యశాఖకు సూచించింది. ప్రభుత్వాల నుంచి ఈ సెంటర్ల ఏర్పాటుకు స్పష్టమైన సూచనలున్నప్పటికీ ఆ దిశగా వైద్యఆరోగ్యశాఖ సరైన కార్యాచరణ చేపట్టకపోవడంతో ఏర్పాటు చేయలేదు. మహబూబ్‌నగర్, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాలను పరిశీలిస్తే 2023 సంవత్సరంలో జాతీయ రహదారిపై ఈ మూడు జిల్లాల పరిధిలో జరిగిన ప్రమాదాల్లో సకాలంలో సరైన వైద్యమందక 16 మంది చనిపోయారు. మరో 35 మంది వరకు అవయాలు కోల్పోయారు. జాతీయ రహదారితో పాటు ఇతర రహదారులపైనా ప్రమాదాలు జరిగి, ప్రాణాలు కోల్పోయిన వారు ఈయేడాదిలో మరో 22 మంది ఉన్నారు. వీరికి సకాలంలో సరైన వైద్యమందితే బతికే వారని చెబుతున్నారు. హైవేపైనా, అన్ని ఇతర రోడ్లకు సమీపంలో ఉండేలా ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటైతే ఈ మరణాల్లో కనీసం 50 శాతమైనా తగ్గించవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

బాలానగర్, జడ్చర్ల, జానంపేట, ఎర్రవెల్లి వద్ద ఏర్పాటుకు అవకాశం

44వ నెంబర్ జాతీయ రహదారిపై ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రాంతాలకు అనుగుణంగా ఉండేలా బాలానగర్, జడ్చర్ల, జానంపేట, ఎర్రవెల్లి వద్ద ట్రామాకేర్ సెంటర్లను ఏర్పాటు చేస్తే బాగుంటుందనే సూచనలు వస్తున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలోనూ ఈ ప్రతిపాదనలు ఉన్నప్పటికీ కార్యరూపం దాల్చలేదు. జానంపేట పీహెచ్‌సీ వద్ద ఐదెకరాల స్థలాన్ని కూడా ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటుకు అప్పట్లో ప్రతిపాదించారు. ఇక్కడున్న పీహెచ్‌సీని 50 పడకలకు పెంచి, దాంట్లోనే సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. కానీ ముందుకు సాగలేదు. తాజాగా మళ్లీ ట్రామాకేర్ సెంటర్ల ఏర్పాటు అంశం తెరమీదకు రావడంతో ఈనాలుగు ప్రాంతాల్లో వాటిని ఏర్పాటు చేస్తే ఉపయుక్తంగా ఉంటుందనే అభిప్రాయం వెల్లడవుతోంది.


జానంపేట పీహెచ్‌సీ



అందుబాటులో అత్యవసర వైద్యం

ట్రామాకేర్ సెంటర్లు ఏర్పాటైతే అక్కడ ప్రమాదాల్లో గాయపడిన వారికి చికిత్స అందించే నిమిత్తం 24 గంటలు వైద్య సేవలు అందుబాటులో ఉంటాయి. ఈ సెంటర్లు మూడు రకాలుగా ఉంటాయి. ఎల్-3 ట్రామాకేర్ సెంటర్ అయితే ఏడాదికి రూ.తొమ్మిది కోట్ల నిర్వహణ వ్యయం ఉంటుంది. ఎల్-2 సెంటర్ అయితే ఏడాదికి రూ.20 కోట్లు, ఎల్-3 ట్రామాకేర్ సెంటర్ అయితే ఏడాదికి రూ.50 కోట్ల వరకు వ్యయం ప్రభుత్వం అందిస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ వ్యయాన్ని భరిస్తాయి. ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటైన ప్రతీ చోటా ఆర్థోపెడిక్ సర్జన్, న్యూరో సర్జన్, న్యూరో ఫిజీషియన్, కార్డియాక్ స్పెషలిస్టుతో ఇతర సాంకేతిక సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంటారు. అదేవిధంగా ప్రతీ కేంద్రం వద్ద బ్లడ్ బ్యాంకు ఏర్పాటు చేస్తారు. వీటితో పాటు మూడు ప్రత్యేక అంబులెన్సులు ఈ కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచుతారు. ప్రమాదాల్లో గాయపడ్డ వారిని అంబులెన్స్‌ల ద్వారా ఈ కేంద్రం వద్దకు తెచ్చిన వెంటనే అవసరమైన అత్యవసర చికిత్స అందిస్తారు. వెంటనే అవసరమైతే ఆర్థోపెడిక్, ఇతర సర్జరీలు నిర్వహిస్తారు. ఆక్సిజన్, ఎమర్జెన్సీలో ఉపయోగించే ఇంజక్షన్లు, మందులు కూడా అందుబాటులో ఉంచుతారు. ప్రమాద బాధితుల ప్రాణాలు పోకుండా ఉండేందుకు అవసరమైన మేర చికిత్సను ఈ సెంటర్ల ద్వారా అందిస్తారని వైద్యులు పేర్కొంటున్నారు. ఈ కేంద్రం ఏర్పాటైతే ఒక మోస్తారు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటైనట్లేనని అంటున్నారు. కేవలం ప్రమాద బాధితులకే కాకుండా ఇతర సమయాల్లో సాధారణ రోగులు, దీర్ఘకాలిక రోగులకు సైతం అదే స్థాయిలో ఇక్కడ వైద్య సేవలు అందుతాయి.

గ్రామాల అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకం

- అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

ఖిల్లాఘణపురం, జనవరి 10: గ్రామాల అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకమని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ తెలిపారు. వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలంలోని ఉప్పరిపల్లి, మానాజీపేట, అల్లమాయపల్లి గ్రామాల్లో నర్సరీ, పల్లెప్రకృతివనం, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లోని రికార్డులను, పంచాయతీ కార్యదర్శుల ఉద్యోగ క్రమబద్ధీకరణ నిమిత్తం గ్రామంలో జరిగిన అభివృద్ధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీ రికార్డులలో నమోదును సక్రమంగా చేయాలని సూచించారు. నర్సరీలో నాటిన మొక్కల వివరాలు తేదీలను బోర్డులపై ప్రదర్శించాలని సూచించారు. నర్సరీలో ప్రజల ఆకాంక్షల మేరకు పండ్ల పూల మొక్కలను పెంచడానికి ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. పల్లె ప్రకృతివనాల్లో ఎండిపోయిన మొక్కల స్థలంలో కొత్తగా మొక్కలు నాటాలని అన్నారు. పల్లె ప్రకృతి వనాలు గ్రామాలకు కొత్త శోభను అందించాయని ఆకాంక్షించారు. గ్రామాల్లో పచ్చదనాన్ని పెంపొందించడానికి ప్రతీ ఒక్కరు సహకరించాలని అన్నారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో డీపీవో సురేష్ కుమార్, ఎంపీడీవో విజయ్ కుమార్, ఎంపీవో రాజు, సర్పంచులు రాంరెడ్డి, సతీష్, శేషయ్య, కార్యదర్శులు పాల్గొన్నారు.

కారు బోల్తా

తాడూరు, జనవరి 10: నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం సిర్సవాడ గ్రామ సమీపంలో బుధవారం మధ్యాహ్నం ఒక కారు బోల్తా విద్యుత్ స్తంభానికి ఢీకొని, బోల్తా పడింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడూరు మండలం అంతారం గ్రామానికి చెందిన వ్యక్తి జడ్చర్ల నుంచి అంతారం వైపు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. కారు బోల్తా పడిన సమయంలో కారులో ఒక్కరే ఉన్నారని తెలుస్తోంది. ఈ ఘటనకు సంబంధించి ఎలాంటి కేసు నమోదు కాలేదని ఎస్సై రామన్‌గౌడ్ తెలిపారు. కారు డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు.


ఫైనల్స్‌లో ముగ్గులు వేస్తున్న పోటీదారులు


సినీనటి అనన్యతో సెల్ఫీ దిగుతున్న యువతులు, మహిళలు


ప్రథమ స్థానంలో నిలిచిన ముగ్గు వద్ద మహిళలు

ముగ్గుల హరివిల్లు

ఉత్సాహంగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీ ఫైనల్


ముగ్గు వేస్తున్న పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని


ముగ్గు వేస్తున్న కాంగ్రెస్ నేత ఝాన్సీరెడ్డి


ముగ్గులను పరిశీలిస్తున్న అతిథులు



ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరాబ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు (పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు.. రియల్ పార్టనర్: స్వర్గసీమ సుకేతన) ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో జరిగిన ఫైనల్స్‌లో పోటీదారులు వేసిన ముగ్గులతో ఇంద్రధనస్సు నేలకు దిగి వచ్చిందా అనిపించింది. తెలంగాణవ్యాప్తంగా 45 కేంద్రాల్లో పోటీలు జరగగా, ఉమ్మడి జిల్లా నుంచి ఒకరు ఫైనల్స్‌లో తమ ముగ్గులతో పోటీ పడ్డారు. సినీనటి అనన్య నాగళ్ల, పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినితో పాటు కాంగ్రెస్ నేత ఝాన్సీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సినీనటి అనన్య


ముగ్గులు వేస్తున్న మహిళలు




అతిథులకు స్వాగతం పలుకుతున్న ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్ ఇన్‌చార్జి కృష్ణప్రసాద్, స్టేట్ బ్యూరో చీఫ్ ఉప్పులూరి మురళీకృష్ణ

పర్వతాపూర్ మైసమ్మ హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న గ్రామస్థులు

నవాబ్‌పేట, జనవరి 10 : మండలంలోని పర్వతాపూర్ మైసమ్మ దేవస్థానంలో బుధవారం అమ్మవారి జాతర మహోత్సవాల హుండీ లెక్కింపు చేపట్టారు. 33 మాసాల వెండి, రూ.లక్షా ఇరవై మూడువేల నగదు వచ్చినట్లు ఆలయ చైర్మన్ పాశం కృష్ణయ్య, ఈఓ మదనేశ్వర్ రెడ్డి తెలిపారు. జాతరను విజయవంతం చేసిన భక్తులకు వారు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైస్ ఎంపీపీ సంతోష్ రెడ్డి, సర్పంచ్ జంగమ్మ, వేణుచారీ, నారాయణ రెడ్డి, తానెం రాజు, మాదవులు, మైనుద్దీన్, ఆలయ సిబ్బంది గోపాల్, నర్సింహులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ప్రవేశాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

పాలమూరు యూనివర్సిటీ, జనవరి 10 : బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ, పీజీ అడ్మిషన్స్ ప్రవేశాల కోసం ఈ నెల 31లో దరఖాస్తు చేసుకోవాలని ఎంవీఎస్ కళాశాల ప్రిన్సిపాల్ కె.పద్మావతి, వర్సిటీ సెంటర్ రీజనల్ కో ఆర్డినేటర్ సత్యనారణ గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నత విద్యను చదవాలనుకున్నవారు దరఖాస్తులు చేసుకోవాలని, ఇతర వివరాలకు సెంటర్‌లో సంప్రదించాలని తెలిపారు.

'బీఎడ్ విద్యార్థులకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ నిర్వహించాలి'

పాలమూరు యూనివర్సిటీ, జనవరి 10 : పాలమూరు యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న బీఎడ్ కళాశాల విద్యార్థులకు డీఎస్సీ, టెట్‌ను దృష్టిలో పెట్టుకుని నాల్గవ సెమిస్టర్ విద్యార్థులకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలని విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. బుధవారం పరీక్షల నిర్వహణ అధికారి డాక్టర్ రాజ్‌కుమార్‌కు స్వేరో పీయూ విద్యార్థి నాయకులు రూప్‌సింగ్, నాగార్జున, ప్రేమలత, అఖిల, రాధిక, సౌలేశ్వరి, శేఖర్ వినతి పత్రం అందజేశారు.

ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్స్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

జడ్చర్ల, జనవరి 10 : ఈఎంఆర్‌ఐ(108) సంస్థలో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్స్‌గా పని చేసేందుకు ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని 108, 102 సర్వీసెస్ మహబూబ్‌నగర్ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ మహబూబ్‌మియా బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ నర్సింగ్, జీఎన్‌ఎం, ఏఎన్‌ఎం, ఎంఎల్‌టీ, డీఎంఎల్‌టీ కోర్సులు చేసిన వారు 30 సంవత్సరాల లోపు ఈ నెల 12లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మహబూబ్‌నగర్, హైదరాబాద్ జిల్లాలో పనిచేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ నెల 12న జడ్చర్లలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలోని 108 కార్యాలయంలో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 3గంటల వరకు ఇంటర్వ్యూలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్వ్యూకు ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో పాటు ఒక సెట్ జిరాక్స్‌కాపీలను వెంట తీసుకురావాలని కోరారు.

రవీంద్రటాకీస్‌లో ఎగిసిపడ్డ మంటలు

నాగర్‌కర్నూల్ క్రైం, జనవరి 10 : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని నాగనూల్ చౌరస్తాలో గల రవీంద్రటాకీస్‌లో బుధవారం సాయంత్రం ప్రమాదవశాత్తు మంటలు ఎగిసిపడ్డాయి. స్థానికులు గుర్తించి అగ్నిమాపక కేంద్రానికి సమాచారమందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న నాగర్‌కర్నూల్‌తో పాటు, కల్వకుర్తి అగ్నిమాపక వాహనాలు మంటలను ఆర్పివేశారు. చాలా ఏళ్లుగా ఈ థియేటర్ మూతపడడంతో చెత్తచెదారం పేరుకుపోయింది. ప్రమాదవశాత్తు అంటుకున్న మంటలతో ప్రొజెక్టర్‌తో పాటు, కుర్చీలు, అందులో ఉన్న డోర్లు కాలి అగ్నికి ఆహుతి అయ్యాయి.

యాంత్రీకరణతోనే సాగు లాభదాయకం

- ఏడీఆర్ డాక్టర్ మల్లారెడ్డి



వేరుశనగ డిగ్గర్ యంత్రం పనితీరును వివరిస్తున్న ఏడీఆర్

బిజినేపల్లి, జనవరి 10 : పంటల సాగుకు విరివిగా యంత్ర పరికరాల వినియోగం పెంచుకోవడం ద్వారా పెట్టుబడి తగ్గడంతో నాణ్యమైన పంట ఉత్పత్తుల వల్ల వ్యవసాయం లాభదాయకంగా ఉంటుందని ప్రొఫెసర్ జయశంకర్ దక్షిణ తెలంగాణ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ మల్లారెడ్డి అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం అల్లీపూర్‌లో బుధవారం వేణుగోపాల్ అనే రైతు పొలంలో వేరుశనగ డిగ్గర్ అనే యంత్రం పనితీరుపై క్షేత్ర ప్రదర్శన నిర్వహించి, మాట్లాడారు. వేరుశనగ సాగులో పంట కోత సమయంలో కూలీల అవశ్యకత ఎక్కువగా ఉండడం వల్ల పెట్టుబడి ఎక్కువ అవుతున్నట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. పెట్టుబడి తగ్గించడంతో పాటు, కూలీల కొరతను అధిగమించేందుకు వివిధ పంటల సాగులో యాంత్రీకరణ వైపు రైతులు మొగ్గు చూపాలని సూచించారు. అలాగే, ఈ ప్రాంత నేలలకు అనువైన వేరుశనగ పంట రకాలను, తీసుకోవల్సిన యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, డాక్టర్ రామిరెడ్డి, డాక్టర్ విజయలక్ష్మి, శాస్త్రవేత్తలు స్రవంతి, రామకృష్ణ, మండల వ్యవసాయ శాఖ అధికారి నీతిరెడ్డి, ఏఈఓ మధు, 65 మంది రైతులు పాల్గొన్నారు.

భూములు కోల్పోతున్నాం...
ప్రాజెక్టులు మాకొద్దు

- కాల్వల ద్వారా న్యాయం చేయండి
- తహసీల్దార్ కార్యాలయంలో బాధిత రైతుల వినతి



బల్మూరు తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ పద్మకు వినతిపత్రం అందజేస్తున్న నిర్వాసితులు

బల్మూరు, జనవరి 10 : ఉమామహేశ్వర ప్రాజెక్టు నిర్మాణం కోసం తాము భూములు కోల్పోతున్నామని, తమ పరిస్థితి ఏంటని, తాము ఎలా బతకాలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలం మైలారం గ్రామ సమీపంలో ఉమామహేశ్వర ప్రాజెక్టు నిర్మాణం చేపట్టనున్నట్లు అధికారులు, ప్రజాప్రతినిధులు తెలుపడంతో భూములు కోల్పోతున్న రైతులు లోలోపల మదనపడుతున్నారు. గత ప్రభుత్వం రూపకల్పన చేసిన ప్రాజెక్టు నిర్మాణం మ్యాపుల ద్వారా ప్రజలకు కొంత ఊరట ఇచ్చినప్పటికీ ప్రస్తుత కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రాజెక్టు నూతన నిర్మాణం పేరున ప్రణాళిక రచించి కొత్తగా విడుదల చేయడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాత ప్రాజెక్టు ఒకవైపు అయితే నూతనంగా ఏర్పడే ప్రాజెక్టు నిర్మాణం కోసం చేస్తున్న కృషిలో నూత నంగా వచ్చిన ప్రభుత్వం ఎంతవరకు సఫలీకృతమ వుతుందో తెలియదు కానీ రైతులకు మాత్రం ఆవేద న మిగిలింది. నూతన ప్రాజెక్టు ద్వారా దాదాపు రెండు వేల 500ఎకరాల నుంచి మూడు వేల ఎకరాల వరకు సాగుభూమి కోల్పోతున్నట్లు సమాచారం గట్టిగా ఉన్నప్పటికీ రైతులు ఉన్న భూములను కోల్పోతే చివరకు మిగిలేది ఏముందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం, ఎమ్మెల్యే వంశీకృష్ణ రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నారు. పాత ప్రభుత్వం ఇచ్చిన ప్రణాళిక ప్రకారం ప్రాజెక్టు నిర్మాణం కోసం చేపట్టే దేవస్థానం నిర్మాణం చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఏదేమైనా ప్రభుత్వాలు మారుతున్న కూడా రైతుల జీవితాలతో ఆటలాడుకునే విధంగా ప్రభుత్వ సంస్థలు, అధికారులు ప్రాజెక్టుల నిర్మాణంలో ప్రతినిత్యం కృషి చేస్తున్న వ్యవస్థను బట్టి కొందరు రైతులు నష్టపోతే వందలాది మంది రైతులు బాగుపడుతారు. మరోవైపు ప్రభుత్వం నాటి ప్రా జెక్టుల పైన ఉన్న విధివిధానాలను చూస్తూ నూత నంగా వచ్చే ప్రాజెక్టు నిర్మాణంలో మార్పుచేర్పులను కూడా ఆలోచించడంపై కొందరు మేధావులు రైతులు నష్టపోకుండా ప్రభుత్వం కృషి చేస్తున్నదని వారు పేర్కొన్నారు. రైతుల కోసం పనిచేసే ప్రభు త్వాలు రైతుల సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేసి, విధివిధానాలురూపొందించాలని మండల రైతులు కోరుతున్నారు.

'పాలమూరు-రంగారెడ్డి'పై విచారణ జరపాలి

- పాలమూరు అధ్యయన వేదిక

మహబూబ్‌నగర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ ఎం.రాఘవాచారి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, నూతనంగా గెలిచిన ఎమ్మెల్యేలు పాలమూరు- రంగారెడ్డి లిఫ్టు అవినీతిపై పోరాటం చేయాలని, ప్రజలకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై జరుగుతున్నంత చర్చ పాలమూరు- రంగారెడ్డి, పాలమూరు-డిండి ప్రాజెక్టుల అవినీతిపై జరగడం లేదని అభిప్రాయపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఈరెండు పథకాల అవినీతిపైకూడా తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టు అవినీతిపై తీవ్రంగా ఆరోపణలు చేసిన మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి తన స్వప్రయోజనాల కోసం బీఆర్ఎస్‌లో చేరారని, ఆయన ఇప్పుడు నోరుమెదపరని అన్నారు. ప్రాజెక్టు రీడిజైన్ వల్ల వ్యయం భారీగా పెరిగిందని, అవినీతి కోసమే రీడిజైన్ చేశారని రైతాంగం భావించారని పేర్కొన్నారు. రీడిజైన్ చేశాక కూడా లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ పనులు చేపట్టలేదని విమర్శించారు. నిర్మాణం చేపట్టిన నార్లాపూర్, ఏదుల, వట్టెం, కరివెన, ఉదండాపూర్ రిజర్వాయర్లను ఎక్కడాలేని విధంగా చుట్టూ కట్టలుగా చాలా బలహీనంగా నిర్మించారని, వాటితో ముందు చాలా కష్టనష్టాలకు అవకాశ ముందని, నిపుణులు, ఇంజనీర్లు లేఖలురాసినా అప్పటి సీఎం కేసీఆర్ ఖాతరు చేయలేదని పేర్కొన్నారు. ఉద్యమ పార్టీ అనేభావనతో బీఆర్ఎస్‌ని గెలిపిస్తే, తెలంగాణలోనే అత్యంత వెనకబడిన పాలమూరుకు ఏమీ చేయలేదని దుయ్యబట్టారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనుల నిర్వహణే ఆ పార్టీ మోసం చేసిన వైఖరికి నిదర్శనమని పేర్కొన్నారు.

వ్యక్తి అదృశ్యం : కేసు నమోదు

నవాబ్‌పేట, జనవరి 10 : మండలంలోని హన్మసానిపల్లి గ్రామానికి చెందిన చెన్నారం కృష్ణయ్య పదేళ్ల క్రితం బైక్‌పై వెళ్తూ కిందపడ్డాడు. అప్పటినుంచి మతిస్థిమితం లేక ఊర్లో, బంధువుల వద్దకు ఎక్కడపడితే అక్కడ తిరిగి ఇంటికి వచ్చేవాడు. ఐదేళ్ల నుంచి ఇంటికి రావడం లేదని, ఇతని ఆచూకీ కనిపెట్టాలని ఆయన భార్య చెన్నారం లక్ష్మీదేవి బుధవారం నవాబ్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేసిందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్ఓ సురేష్‌బాబు తెలిపారు.

కాళేశ్వరంపై సీబీఐతో విచారణ జరిపించాలి

» బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ



జడ్చర్లలోని అయ్యప్పస్వామి దేవాలయంలో పూజ చేస్తున్న డీకే అరుణ

జడ్చర్ల, జనవరి 10 : కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై సీబీఐతో విచారణ చేయించాలని మాజీ మంత్రి, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ డిమాండ్ చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పట్టణంలోని గంగాపురం రోడ్డులో గల అయ్యప్పస్వామి దేవాలయంలో బుధవారం ఆమె ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదని అన్నారు. ఎన్నికల ముందు మాట్లాడింది వేరని, అధికారంలోకి వచ్చిన తర్వాత మాట్లాడుతున్నది వేరుగా ఉందని ఆరోపించారు. కాళేశ్వరంపై జరిగిన అవినీతిని బయటికి తేవాలని, అవినీతి పరులు ఏ విధంగా కుమ్మక్కయ్యారు?, నిర్మాణంలో జరిగిన లోపాలేంటి?, రూ.లక్షల కోట్లకు అంచనా ఎందుకు పెరిగింది?, వేల కోట్ల రూపాయలు అప్పులు తెచ్చి రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిన వారిని బట్టబయలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆ అవకాశం కాంగ్రెస్‌కు పార్టీకి ప్రజలు ఇచ్చారని అన్నారు. కాళేశ్వరంతో పాటు రాష్ట్రంలో జరిగిన అవినీతి కక్కించాలంటే సీబీఐతో విచారణ చేయించాలని కోరారు. జ్యుడీషియల్ విచారణతో అవినీతి బట్టబయలు అవుతుందనే విశ్వాసం ఉండదన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తీవ్ర వ్యతిరేకతను మూటకట్టుకుందని అన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్యనే పోటీ ఉంటుందన్నారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానాలతో పాటు తెలంగాణలో, దేశవ్యాప్తంగా మళ్లీ ప్రధాన మంత్రిగా నరేంద్రమోదీ రావాలని ప్రజలంతా కోరుకుంటున్నారన్నారు. అసెంబ్లీలో ఇతర పార్టీలకు ఓటు వేసినా, పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకే ఓటు వేస్తామని, నరేంద్రమోదీ నాయకత్వమే కావాలని ప్రజలు అంటున్నారని చెప్పారు. మూడో పర్యాయం నరేంద్రమోదీ ప్రధాన మంత్రి అవుతున్నారన్నారు. నరేంద్రమోదీకి పోటీ ఇచ్చే అభ్యర్థి కాంగ్రెస్ పార్టీలో జాతీయ స్థాయిలో లేరన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు సాహితిరెడ్డి, చెవ్వ నాగరాజు, మధు, కొంగళి శ్రీకాంత్, అమర్నాథ్‌గౌడ్, అయ్యప్ప స్వాములు రంజిత్ బాబు, ఎర్ర శ్రీనుతో పాటు పలువురు పాల్గొన్నారు.

విద్యుత్ తీగ తాకి రైతు మృతి



సామ్యానాయక్ (ఫైల్)

లింగాల, జనవరి 10 : నాగర్‌కర్నూలు జిల్లా లింగాల మండల పరిధిలోని కొత్తచెర్వు తండాకు చెందిన రైతు ముడావత్ సామ్యానాయక్ (60) విద్యుత్ షాక్‌కు గురై బుధవారం మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి గ్రామస్థులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. సామ్యానాయక్ రబీలో తన సొంత వ్యవసాయ పొలంలో వేరుశనగ పంటను సాగు చేసుకు న్నాడు. అడవి పందుల నుంచి పంటను రక్షించుకోవడానికి పంట చుట్టూ విద్యుత్ కంచెను ఏర్పాటు చేసుకున్నాడు. మంగళవారం రాత్రి చేనుకు నీటి తడిని పెట్టి తెల్లవారు జామున బోరుమోటారును బంద్ చేయడానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు కంచెను తాకడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పొలానికి వెళ్లిన వ్యక్తి మధ్యాహ్నం వరకు కూడా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలం దగ్గరికి వెళ్లగా మృతదేహం కనిపించింది. మృతునికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. ఈ సంఘటనకు సంబంధించి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై శ్రీనివాసులు తెలిపారు.

రేషన్‌లో ప్రొటీన్స్ బియ్యం ?

- ప్లాస్టిక్ బియ్యం అంటూ లబ్ధిదారుల అనుమానం
- ఆందోళన వద్దని తహసీల్దార్ సూచన

నవాబ్‌పేట, జనవరి 10 : పేదలకు అందిస్తున్న రేషన్ బియ్యంలో ప్లాస్టిక్ బియ్యం వస్తున్నాయంటూ మండలంలో రెండు రోజులు పుకార్లు షికార్లు చేస్తున్నాయి. పేద ప్రజలకు మంచి ఆహారం ఇవ్వాలన్న భావనతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతీ నెల చౌకధర దుకాణాల ద్వారా సరఫరా చేస్తున్న బియ్యం ప్లాస్టిక్ బియ్యం కలిపారని ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. క్వింటాలుకు మూడు కిలోల ప్రొటీన్స్ లభించే చిరుధాన్యాలను కలిపి బియ్యంలో కలిపి అందిస్తున్నారు. దీంతో గ్రామాల్లో ఉన్న పేదలు తీసుకునే బియ్యంలో ప్లాస్టిక్ బియ్యం వస్తున్నాయంటూ ఆందోళన చెందుతున్నారు. మండలంలోని గురుకుంట, కారుకొండ తదితర గ్రామాల్లో ప్రభుత్వం పంపిణీ చేసిన బియ్యాన్ని బుధవారం 'ఆంధ్రజ్యోతి' పరిశీలించగా అవి ప్రొటీన్స్ బియ్యం అంటూ సివిల్ సప్లై, మండల డీలర్లు తెలిపారు. ఈ విషయంపై తహసీల్దార్ మల్లికార్జున్ రావును వివరణ కోరగా పేదలకు అందిస్తున్న ప్రొటీన్స్ బియ్యం అని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన ఆంధ్రజ్యోతికి తెలిపారు.

వ్యక్తి రిమాండ్

గోపాల్‌పేట, జనవరి10: అమ్మాయి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు బుధవారం ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలంలోని ఓ తండాకు చెందిన అమ్మాయి పట్ల కాట్రావత్ సంతోష్ అనే వ్యక్తి అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ విషయంపై కుటుంబ సభ్యులు ఈనెల 5న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టి సంతోష్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

తొమ్మిది క్వింటాళ్ల నల్లబెల్లం స్వాధీనం

- ఒకరిపై కేసు నమోదు

లింగాల, జనవరి 10 : అక్రమంగా తరలిస్తున్న తొమ్మిది క్వింటాళ్ల నల్లబెల్లం పట్టుబడినట్లు ఎస్సై శ్రీనివాసులు తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం ముక్కిడిగుండం గ్రామానికి చెందిన భాస్కర్ మంగళవారం రాత్రి మహేంద్రా వాహనంలో లింగాలకు బెల్లం తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో నిఘా ఉంచినట్లు ఎస్సై చెప్పారు. మండల కేంద్రంలోని కూరగాయల మార్కెట్ ప్రాంతంలో ఉంచిన వాహనాన్ని సోదా చేయగా అందులో 30 బస్తాల నల్లబెల్లం కన్పించింది. వాహనంతో పాటు, మరో వాహనాన్ని స్వాధీనపర్చుకొని వ్యక్తిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రొఫెసర్ పిండి పవన్ కుమార్‌కు ఘన సన్మానం



వార్డెన్‌లను సన్మానిస్తున్న పీయూ అధికారులు

పాలమూరు యూనివర్సిటీ, జనవరి 10 : మైక్రోబయాలజీలో ఎన్నో పరిశోధనలు చేసినందుకు గాను మైక్రోబయాలజిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా (ఎంబీఎస్ఐ) ఫెలో షిప్ అవార్డును పాలమూరు యూనివర్సిటీ మాజీ రిజిస్ట్రార్, పీయూ రీసెర్చ్ సెల్ డైరెక్టర్, యంగ్ సైటిస్ట్ మైక్రోబయాలజీ అధ్యాపకులు ప్రొఫెసర్ పిండి పవన్ కుమార్‌ను బుధవారం పీయూ పీజీ కళాశాల, ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రకిరణ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణయ్య, అన్ని విభాగాల అధిపతులు, అధికారులు ఘనంగా సత్కరించారు.

- ఇదిలా ఉంటే బాలుర హాస్టల్ వార్డెన్‌లుగా దాదాపు ఏడేళ్లపాటు సేవలు అందించిన సురేష్, శ్రీనివాస్‌లను శాలువా, పూలబొకేతో ఘనంగా సన్మానించారు. ఓ వైపు విద్యార్థులకు బోధిస్తూనే, అదనంగా వార్డెన్ బాధ్యతలు నిర్వహించారు. వీరిని రిలీవ్ చేసి, వారే వారికి బాధ్యతలు అప్పగించారు. ఈ కార్యక్రమంలో పీయూ అధ్యాపకులు, నాన్ టీచింగ్ సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

16 పెద్దకార్పాములలో అంతర్రాష్ట్ర బండలాగుడు పోటీలు

పెద్దకొత్తపల్లి, జనవరి 10 : నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం పెద్దకార్పాముల గ్రామంలో ఈనెల 16వ తేదీన ఫ్రెండ్స్ యువజన సంఘం ఆధ్వర్యంలో అంతర్రాష్ట్ర న్యూకేటగిరీ విభాగం బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు ఫ్రెండ్స్ యువజన సంఘం సభ్యుడు సొంటె ఎల్లయ్య తెలిపారు. పోటీల్లో పాల్గొనే వృషభరాజుల యాజమానులకు మొదటి బహుమతి రూ.50వేలు, రెండవ బహుమతి రూ.40వేలు, మూడవ బహుమతి రూ.30వేలు, నాల్గవ బహుమతి రూ.20వేలు, ఐదవ బహుమతి రూ.10వేలు, ఆరో బహుమతి రూ.8వేలు అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అలాగే, పోటీలో పాల్గొనే ప్రతీ ఎద్దుల జతకు రూ.ఐదు వేల ప్రోత్సాహక బహుమతులను అందిస్తామన్నారు. బండలాగుడు పోటీల్లో పాల్గొనే ఎద్దుల యాజమానులు వెయ్యి రూపాయలు ఎంట్రీ ఫీజు చెల్లించి అదేరోజు ఉదయం ఎనిమిది గంటలలోపు పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. పోటీలకు రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథిగా వస్తున్నట్లు వారు తెలిపారు. గ్రామాల్లోని ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని, పోటీలను తిలకించాలని ఆయన కోరారు.

మార్కెట్‌కు వచ్చిన ఉల్లి



ఉల్లికి వేలం వేస్తున్న వ్యాపారస్తులు

దేవరకద్ర, జనవరి 10 : దేవరకద్ర మండలంలోని వివిధ గ్రామాలలో రైతులు పండించిన ఉల్లి విక్రయించేందుకు బుధవారం వ్యవసాయ మార్కెట్‌యార్డుకు తీసుకొచ్చారు. మార్కెట్‌లో జరిగిన లావదేవీల్లో గరిష్ఠంగా రూ.2000, కనిష్ఠంగా రూ.1000, ధర పలికినట్లు మార్కెట్ సెక్రటరీ ఎల్లయ్య తెలిపారు. వ్యాపారులు, కొనుగోలుదారులు ఉల్లిని కొనుగోలు చేశారు. ఇప్పుడు సీజన్ కావడంతో మార్కెట్‌కు ఉల్లి వస్తున్నది. ఇంకా పెద్ద మొత్తంలో మార్కెట్‌కు రానుందని అధికారి తెలిపారు. మార్కెట్‌కు 265 క్వింటాళ్ల ఉల్లి అమ్మకానికి వచ్చినట్లు ఆయన తెలిపారు.

అయోధ్యలో రామాలయం ఉంటే ప్రతీ ఊర్లో ఉన్నట్లే

- త్రిదండి అష్టచారి సంపత్‌కుమార్ రామానుజ జీయర్‌స్వామి



ఆలయంలో స్వామివారికి పాదపూజ చేస్తున్న అర్చకులు

శ్రీరంగాపూర్, జనవరి 10: అయోధ్యలో రామాలయం ఉంటే ప్రతీ ఊర్లో ఉన్నట్లేనని త్రిదండి అష్టచారి సంపత్‌కుమార్ రామానుజ జీయర్‌స్వామి వెల్లడించారు. బుధవారం శ్రీరంగాపురం గ్రామంలో శ్రీ రంగనాయక స్వామి ఆలయాన్ని వారు దర్శించారు. ఈ సందర్భంగా స్వామివారిని బాజాభజంత్రీలతో భక్తి శ్రద్ధలతో శోభాయాత్ర నిర్వహించారు. గ్రామంలోని హనుమాన్ ఆలయంలో స్వామివారు పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీరంగనాయక స్వామి ఆలయానికి చేరుకున్నారు. ఆలయ నిర్వాహకులు స్వామివారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో పూజల అనంతరం స్వామివారికి పాద పూజలు నిర్వహించారు. మఠంలో ప్రవచనాలు చెప్పారు. ప్రతీ హిందువు వేదాలు చదవాలన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు కన్నయ్యస్వామి, విష్ణునారాయణస్వామి, కిట్టుస్వామి, సురేష్, ఆచార్యులు, జడ్పీటీసీ సభ్యుడు ఎం.రాజేంద్రప్రసాద్, ఎంపీపీ గాయత్రి, సర్పంచు వినీలరాణి, సింగిల్‌విండో అధ్యక్షుడు ఎం.జగన్నాథం నాయుడు, నాయకులు ఆర్.పృథ్వీరాజ్, రాములుయాదవ్, కురుమన్న, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



అచ్యుతాపూర్‌లో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న గ్రామ సర్పంచ్ శారద ఆశన్ననాయుడు

వనపర్తి రూరల్, జనవరి 10: వనపర్తి మండల పరిధిలోని అచ్యుత్యాపురం గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని బుధవారం శివాజీ యూత్ ఆధ్వర్యంలో శివకుమార్ స్మారక జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను గ్రామ సర్పంచ్ శారదఆశన్న నాయుడు ప్రారంభించారు. ఈ టోర్నమెంట్‌లో 30 టీములు పాల్గొననున్నాయి. మొదటి బహుమతిగా రూ.20వేలు, ద్వితీయ బహుమతిగా రూ.10వేలు అందజేస్తున్నట్లు శివాజీ యూత్ ఆర్గనైజర్స్ రామస్వామి , శేఖర్ , శివ, గణేష్ తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ లక్ష్మి గంగన్న, మాజీ ఉప సర్పంచ్ పాపిరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాసులు, సింగిల్‌విండో డైరెక్టర్ శివశంకర్ రెడ్డి, శివకుమార్, చక్రవర్తి, కె.శేఖర్, ఏ.చంద్రయ్య, క్రికెటర్ల బృందం , గ్రామ పెద్దలు యువకులు పాల్గొన్నారు.

కిక్ బాక్సింగ్ పోటీల్లో విద్యార్థినులు ప్రతిభ చాటాలి



కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో కాంగ్రెస్ నాయకులు

ఖిల్లాఘణపురం,జనవరి10: కిక్ బాక్సింగ్ పోటీల్లో కేజీబీవీ విద్యార్థినులు ప్రతిభ చాటాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలోని 37మంది విద్యార్థులు కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపిక కాగా, బుధవారం కాంగ్రెస్ నాయకులు విద్యార్థినులను అభినందించారు. ఈనెల 20, 21 తేదీల్లో ఖేలో ఇండియా మహిళా కిక్ బాక్సింగ్ పోటీలు హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించనున్నందున కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రవాణా సౌకర్యం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ సాయిచరణ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు గంజాయి రమేష్, కాంగ్రెస్ నాయకులు ఆగారం ప్రకాష్, చిట్యాల లింగస్వామి, గోనెల శంకర్, బయని బాలరాజు, బండారి రజినీకాంత్, అజీమ్, కరాటే మాస్టర్ శివకృష్ణ, పాఠశాలల ఎస్‌వో లలిత, పీఈటీ విజయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

చిట్యాల ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని..

వనపర్తి రూరల్: వనపర్తి మండల పరిధిలోని చిట్యాల గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఝాన్సీ ఖేలో ఇండియా కిక్ బాక్సింగ్‌కు ఎంపిక అయిందని బుధవారం కరాటే మాస్టర్ వరుణ్ తెలిపారు. ఈనెల 20, 21న హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో జరగనున్న పోటీల్లో పాల్గొనున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థినిని సర్పంచ్ భాను ప్రకాష్ రావు, హెచ్‌ఎం గణేష్, ఛైర్మన్ సాయిబాబు, పీటీ శేఖర్, కరాటే విద్యార్థులు ప్రవీణ్, హరిప్రసాద్ అభినందించారు.


మోచి కులస్తులను ఆర్థికంగా ఆదుకోవాలి



నూతనంగా ఎంపికైన మోచి సంఘ కమిటీ సభ్యులు

వనపర్తి టౌన్, జనవరి 10: కుల వృత్తినే దైవంగా భావించి జీవిస్తున్న మోచి కులస్తులను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని మోచి సంఘం జిల్లా అధ్య క్షుడు రాజోళి కృష్ణ కోరారు. బుధవారం జిల్లా కేంద్రం లోని మోచి సంఘ భవనంలో సంఘం కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మోచి కులస్తులకు ఫంక్షన్ హాల్ నిర్మించాలని కోరారు. అలాగే బ్యాంక్ నుంచి ఆర్థిక సాయం అందించాలని, అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయిం చాలని, శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని ఎమ్మెల్యే మేఘారెడ్డిని కోరారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు నణేష్, ప్రధాన కార్యదర్శిగా జగదీష్, కార్యదర్శిగా ఉప్పల జగదీష్, కోశాధికారిగా మహేష్, గౌరవ అధ్యక్షులుగా ఆర్ శేఖర్, ఉప్పల రమేష్‌లను ఎన్నుకున్నారు.

కాసుమూరు దర్గాలో కాంగ్రెస్ నాయకుల ప్రార్థనలు



దర్గాను దర్శించుకున్న కాంగ్రెస్ నాయకులు

వనపర్తి టౌన్, జనవరి 10: నెల్లూ రు జిల్లాలోని కాసు మూరు పెద్దదర్గా ను దర్శించుకుని బుధవారం యువ జన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ బాబా ఆధ్వర్యంలో నాయకులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏఐసీసీ కార్యదర్శి, మాజీ మంత్రి జిల్లెల చిన్నారెడ్డికి మంత్రి పదవి వరించాలని దర్గాలో ప్రార్థనలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అబ్దుల్లా, ద్యారపోగు విజయ్‌బాబు, రాములు, బెక్కరి వెంకటేష్ పాల్గొన్నారు.

కోటిలింగేశ్వరుడికి ధాన్యాభిషేకం

కొత్తకోట, జనవరి 10: మండలంలోని కానాయపల్లి గ్రామంలోని కోటిలింగేశ్వర స్వామి ఆలయంలో మాస శివరాత్రిని పురస్కరించుకొని కోటిలింగేశరునికి భక్తులు ధాన్యాభిషేక పూజలు బుధవారం నిర్వహించారు. లోక కల్యాణార్థం 150 కిలోల బియ్యంతో కోటిలిగేశ్వరునికి అభిషేక పూజలు చేయడం రిగిందని ఆలయం ప్రధాన కార్యదర్శి శేఖరయ్య తెలిపారు.పూజల్లో పాల్గొన్న భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఈ రోడ్డు ఇంతేనా?

- నత్తనడకన రోడ్డు నిర్మాణ పనులు
- కంకర పరిచి వదిలివేయడంతో ప్రజల నరకయాతన
- త్వరగా పూర్తి చేయాలని గ్రామస్థులు విజ్ఞప్తి



కంకర వేసి వదిలేసిన రోడ్డు

వీపనగండ్ల, జనవరి 10: గ్రామీణ రోడ్లు నాగరికతకు చిహ్నాలు అని పదేపదే చెబుతుంటారు. అయినా పాలకులు మాత్రం వాటిపై దృష్టి సారించడంలో అలసత్వం వహిస్తున్నారు. గ్రామీణ రోడ్లు బాగు చేస్తామని చెప్పిన ప్రజాప్రతినిధులు వాటి ఊసే మరిచిపోయారని ప్రజలు విమర్శిస్తున్నారు. మండల పరిధిలోని సంగినేనిపల్లికి మెరుగైన రోడ్డు సౌకర్యం కల్పించాలని ఉ ద్దేశంతో చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులు నత్త నకడన సాగుతున్నాయి. కల్వరాల-సంగినేపల్లి రోడ్డు నుంచి తూముకుంట- వ ల్లభాపూర్ రోడ్డు వరకు బీటీ రోడ్డు వేసేందుకు రూ. నాలుగు కోట్లు మంజూర య్యాయి. ఈ నిధులతో నాలుగు కిలోమీటర్ల మేరకు మొదట జీఎస్‌బీ మెటల్ లేయర్ డబ్ల్యూఎంఎం మెటల్‌తో రెండవ లేయర్ వేసి తరువాత బీటీ వేయాల్సి ఉన్నది. 200 మీటర్ల సీసీ రోడ్డు ఏడు కల్వర్టులు నిర్మించాలి. అయిదు కల్వర్టులు నిర్మించి మొదటి లేయర్‌గా కంకర పరిచి రోడ్డు నిర్మాణ పనులను వదిలేశారు. దీనితో ఆ రోడ్డుపై వెళ్లే రైతులు ఆలయానికి వెళ్లే భక్తులు నరకయాతన పడుతున్నారు. కంకర పరచడం వల్ల పశువులు, మనుషులు నడవలేని పరిస్థితి ఏర్పడింది. రాత్రులు వ్యవసాయ పొలాలకు వెళ్లే వారి వాహనాలు అదుపు తప్పడంతో గాయాల పాలవుతున్నారు. కంకర పరిచిన రోడ్డుపై బైకులు పంక్చర్లు కావడంతో అనేక ఇబ్బందులకు గురి కావాల్సి వస్తుందని వాపోతున్నారు. సంక్రాంతి పండుగకు లక్ష్మీనర్సింహ ఆలయంలో ఉత్సవాలు నిర్వహిస్తారు. ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ఎద్దుల బండ్లు, కార్లు, ట్రాక్టర్లలలో భక్తులు తరలి వస్తారు. పండుగ నాలుగు రోజులు మాత్రమే ఉండటం రోడ్డు పూర్తి కాకపోవడంతో భక్తులు , ఉత్సవ నిర్వాహకులు ఆం దోళన చెందుతున్నారు. కంకర రోడ్డుపై డస్ట్ పరిచి రోలర్ తిప్పుతూ ఆలయానికి వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా పనులు చేపట్టాలని కోరుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఉత్సవాల నాటికీ రోడ్డు సౌకర్యం మెరుగుపరచాలని కోరుతున్నారు.

రోడ్డు పనులు పూర్తి చేయాలి



బీటీ రోడ్డు నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయా లి. కంకర పరిచి వదలి వేయడంతో అటు వెళ్లే ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డుపై వెళ్లాంటే నరకం చూడాల్సి వస్తుంది.

- మౌలాలి, సంగినేనిపల్లి, సర్పంచు

ఉత్సవాలకు ఇబ్బందులు లేకుండా వేయాలి



సంగినేనిపల్లి గుట్టలో వెలిసిన లక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో సంక్రాంతికి ఉత్సవాలు నిర్వహిస్తారు. కంకర రోడ్డు వల్ల ఇబ్బందులు పడే అస్కారం ఉంది. డస్ట్ వేసి రోలర్ తి ప్పుతూ ఏలాంటి అసౌకర్యం కలగకుండా రోడ్డు పనులు చేపట్టాలి.

- వెంకటేష్, ఎంపీటీసీ సభ్యుడు

నిధుల కొరత ఉన్నది

బీటీ రోడ్డు నిర్మాణం రూ. 4కోట్లతో చేపట్టాం. నిధుల కొరతతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారు. పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తెస్తున్నాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లి పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటాం.

-విద్యాసాగర్, ఏఈ, పంచాయతీ రాజ్

ప్రభుత్వ భూములు కాపాడాలి

- తెలంగాణ సామాజిక విద్యార్థి అసోసియేషన్ రాష్ట్ర అధికార ప్రతినిధి రమేష్ గౌడ్



తహసీల్దార్ పాండుతో మాట్లాడుతున్న రమేష్ గౌడ్

ఖిల్లాఘణపురం, జనవరి 10: ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని తెలంగాణ సామాజిక విద్యార్థి అసోసియేషన్ రాష్ట్ర అధికార ప్రతినిధి రమేష్ గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం బీజేపీ నాయకులు, గ్రామ యువకులు తహసీల్దార్ కార్యాలయం ముందు ఫ్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రమేష్ గౌడ్ మాట్లాడుతూ వారం రోజుల క్రితం తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని ప్రెస్ క్లబ్ భవనం వెనుకాలే ప్రభుత్వ భూమి సర్వే నంబరు 9లో అక్రమంగా షెడ్ ఏర్పాటు చేసి స్థలం కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ భూములు కాపాడాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. మండల కేంద్రంలో అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల హడావిడి సమయంలో తహసీల్దార్ కార్యాలయంలో రికార్డుల గది అగ్నికి ఆహుతి కావడంపై అనుమానాలు ఉన్నాయని, సమగ్ర విచారణ చేయాలని డిమాండ్ చేశారు. మండలంలోని ప్రజాప్రతినిధులు అధికారుల అండదండలతోనే ప్రభుత్వ భూములు కబ్జా అవుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ భూములు కబ్జాకు కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరసనకారులతో తహసీల్దార్ పాండు మాట్లాడుతూ అక్రమ నిర్మాణ షెడ్డు రేకులు తొలగించామని షెడ్డుకు సంబంధించిన పైపులను సైతం రెండు రోజుల్లో తొలగిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి బుచ్చిబాబు గౌడ్, బీజేపీ నాయకులు కొరిగల గోపాల్, పురుషోత్తం, శివకుమార్, నవీన్ స్వామి ఆంజనేయులు సాయికుమార్ , శివకుమార్ , రవి పాల్గొన్నారు.

వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానం తెలుసుకోవాలి

- మల్లారెడ్డి యూనివర్సిటీ అగ్రికల్చర్ ప్రొఫెసర్ శివశంకర్



విద్యార్థులు తయారు చేసిన వ్యవసాయ స్టాళ్లను పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

మదనాపురం, జనవరి 10: వ్యవసాయంలో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలుసుకోవాలని మల్లారెడ్డి యూనివర్సిటీ అగ్రికల్చర్ ప్రొఫెసర్ శివశంకర్ అన్నారు. మండల కేంద్రంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో నెల రోజులుగా వివిధ గ్రామాలలో రైతులతో కలిసి గ్రామీణ అనుభవాలు తెలుసుకున్న అగ్రికల్చర్ విద్యార్థులతో బుధవారం రైతు సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయంలో నూతన టెక్నాలజీని తెలుసుకోవడానికి ఇలాంటి కార్యక్రమం విద్యార్థులకు ఎంతోగాను ఉపయోగపడుతుందని అన్నారు. రైతు సదస్సులో భాగంగా విద్యార్థులు వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానంపై వివిధ రకాల కిచెన్ గార్డెన్, సేంద్రియ వ్యవసాయ విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. అంతేగాక రైతులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. అనంతరం కేవీకే హెడ్ డాక్టర్ ఖోగరే మాట్లాడుతూ రైతు సదస్సులో పాల్గొన్న విద్యార్థులు మూడు నెలల పాటు గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ అనుభవాలు నేర్చుకొని గ్రామంలో ఉండే పంటల ఆధారంగా వివిధ సస్యరక్షణ పద్ధతులు ప్రదర్శించారన్నారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు రాజేందర్‌రెడ్డి, సురేష్‌కుమార్, ముస్తానయ్య , అనిత, భవాని, మల్లారెడ్డి వ్యవసాయ కళాశాల విద్యార్థులు షేక్ రమీజా, బి. దివ్య, ఈ. సాయిప్రియ, వర్ష, సుప్రజ, అతినారపు. మౌనిక, స్వాతి, గౌతమి పాల్గొన్నారు.

దళితబంధు నిధులు ఇవ్వాలి

- కలెక్టరేట్ ముందు దళితుల ధర్నా



దళితబంధు కోసం కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న దళితులు

వనపర్తి రాజీవ్‌చౌరస్తా,జనవరి 10: గత ప్రభుత్వ హయాంలో దళితబంధు పథకానికి దరఖాస్తు చేసుకున్న వారికి తక్షణమే నిధులు మంజూరు చేయాలని పలువురు దళితులు డిమాండ్ చేశారు. బుధవారం వనపర్తి నియోజకవర్గానికి చెందిన పలువురు దళితులు కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం దళితులు ఆర్థికంగా ఎదగాలని దళితబంధు పథకం ప్రవేశ పెట్టిందన్నారు. రెండో విడతగా దళితబంధు మంజూరు చేయడానికి వనపర్తి నియోజకవర్గంలో 1200 మందితో దరఖాస్తులు స్వీకరించిందన్నారు. ప్రభుత్వ సూచన మేరకు బ్యాంకు అకౌంట్ కూడా దరఖాస్తులకు జత చేశామన్నారు. ప్రస్తుతం ఆ దరఖాస్తులను పరిశీలించి లబ్ధిదారులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అంబేడ్కర్ అభయహస్తం పేరిట రూ.12 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. దళితబంధు పథకం పేరిట రూ.10 లక్షలు ఇస్తారా లేదంటే అంబేడ్కర్ అభయహస్తం పథకం ద్వారా రూ.12లక్షలు ఇస్తారా తెలపాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్ అధికారికి వినతిపత్రం అందజేశారు.

రోడ్ల విస్తరణ పేరుతో అక్రమాలు

- కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్
- విద్యుత్ స్తంభాల తొలగింపులో అవినీతి



కాంట్రాక్టర్‌తో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

వనపర్తి టౌన్, జనవరి 10: పట్టణంలో రోడ్ల విస్తరణ పేరుతో అంతులేని అవినీతి, అక్రమాలు జరిగాయని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్ ఆరోపించారు. బుధవారం పట్టణంలోని రాంనగర్ కాలనీలో విస్తరణలో తొలగించిన పాత స్తంభాలను కట్టింగ్ చేస్తున్న ప్రాంతాన్ని కాంగ్రెస్ నాయకులు వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడేళ్లుగా జిల్లా కేంద్రంలో జరుగుతున్న రోడ్ల విస్తరణలో ఇనుప విద్యుత్ స్తంభాల తొలగింపులో విపరీతమైన అవినీతి చోటు చేసుకుందన్నారు. ఎన్ని స్తంభాలు తొలగించారో? ఎన్ని కేజీల తుక్కు (స్క్రాప్) వచ్చిందో? కూడా లెక్కలు లేకపోవడం విస్మయాన్ని కలిగిస్తుందన్నారు. రెండుశాఖల సమన్వయంతో కేవలం నామమాత్రంగా ఎస్టిమేషన్లు వేసి దొరికిన కాడికి దోచుకున్నారని ఆరోపించారు. సంబంధిత కాంట్రాక్టర్‌కు కాంగ్రెస్ పార్టీ నాయకులకు వాగ్వాదం జరిగింది. రోడ్ల విస్తరణలో వెతికేకొద్ది ఒక్కొక్కటిగా అవినీతి బాగోతాలు బయటికొస్తున్నాయని, ప్రతీ ఒక్క అవినీతిని వెలికి తీస్తామన్నారు. స్తంభాల తొలగింపులో ఎలాంటి అవినీతి జరగలేదని, నిబంధనల ప్రకారమే పాత ఇనుప స్తంభాలను కట్టింగ్ చేసి మహబూబ్‌నగర్ విద్యుత్‌శాఖ కార్యాలయానికి పంపిస్తున్నామని కాంట్రాక్టర్ వివరించారు. కార్యక్రమంలో ఓబీసీ జిల్లా ఛైర్మన్ కోట్ల రవి, కాంగ్రెస్ పార్టీ నాయకులు లక్కాకుల సతీష్, యాదగిరి, బొంబాయి మన్నెంకొండ, శశాంక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

పాన్‌గల్, జనవరి10: ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఉత్తల ఫలితాలు సాధించాలని డీఐఈవో జాకీర్ హుస్సేన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులు పరీక్షలపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రకాశం శెట్టి, సిబ్బంది పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం

ఆత్మకూరు, జనవరి10: నేత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో విశ్వ భారతి ప్రైవేటు పాఠశాలలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు వివేకానంద సేవా సమితి సభ్యుడు బాలు తెలిపారు. బుధవారం పాఠశాలలోని 5,6,7,8,9, 10 తరగతుల విద్యార్థులు 260మందికి పైగా పరీక్షలు చేయించుకున్నారని తెలిపారు. అవసరమైన వారికి కంటి అద్దాలు, శస్త్ర చికిత్స రమేష్ సేవా నేత్రం ఫౌండేషన్ పుష్పగిరి కంటి ఆస్పత్రి హైదరాబాద్ మణికంఠ వారి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బాలరాజు, ప్రధా నో పాధ్యాయులు చంద్రయ్య, వివేకానంద సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

జిల్లా రవాణా శాఖ అధికారిగా అవినాష్



జిల్లా రవాణా శాఖ అధికారి అవినాష్‌ను సన్మానిస్తున్న ప్రైవేటు పాఠశాలల యజమానుల సంఘం నాయకులు

వనపర్తి క్రైం, జనవరి 10: జిల్లా రవాణా శాఖ అధికా రిగా అవినాష్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న రామేశ్వర్ రెడ్డి బది లీపై గద్వాల జిల్లా లోని అలంపూర్ చెక్‌పోస్టుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఇక్కడే మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న అవినాష్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. అవినాష్ మాట్లాడుతూ... విధి నిర్వహణలో వాహనదారులు అధికారులకు సహకరించి బాధ్యతగా మెలగాలన్నారు.

మర్యాదపూర్వకంగా కలిసిన ప్రైవేటు పాఠశాలల యజమానులు

జిల్లా రవాణా శాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టాక అవినాష్‌ని జిల్లా ప్రైవేటు పాఠశాలల యజమానుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. జిల్లా రవాణా శాఖ అధికారులకు ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యం తరఫున అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని వారు తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

పాన్‌గల్, జనవరి 10: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో రఘు రాములు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. సమావేశానికి అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

ప్రతీ చిన్నారికి టీకా వేయించాలి

పాన్‌గల్, జనవరి 10: ప్రతీ చిన్నారికి టీకాలు వేయించాలని డాక్టర్ చిరంజీవి అన్నారు. బుధవారం మండల పరిధిలోని రేమద్దుల గ్రామంలో చిన్నారులకు వేస్తున్న టీకా కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారుల్లో వ్యాధులను అరికట్టేందుకు టీకా తప్పనిసరిగా వేయించాలని సూచించారు. పుట్టిన బిడ్డకు ప్రతీ నెల క్రమం తప్పకుండా టీకాలు వేయించాలని కోరారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి కొండా శ్రీనివాస్, ఏఎన్‌ఎం శైలజ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కోర్టు ఉద్యోగాలు సాధించిన యువతకు సన్మానం

కొత్తకోట, జనవరి 10: పట్టణానికి చెందిన బొబ్బిల సంతోష, జనుంపల్లి సంతోష్ కోర్టు ఆఫీస్‌లో సబార్డినేట్ ఉద్యోగాలు సాధించారు. బుధవారం జేఎస్ రాములు ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు శాలువాలతో సన్మానించి అంబేడ్కర్ చిత్రపటాలను బహుకరించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు సతీష్‌రాజు, సభ్యులు కర్ణ కుమార్, సుజ్ఞానం, మన్యం, పౌల్, రాజు, సంజీవరావు, హరీష్, స్త్రైలాబ్, రమేష్ పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన సదస్సు

మదనాపురం, జనవరి 10: మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మదనాపురం, దుప్పల్లి గ్రామాలలో కళాజాత బృందం సభ్యులు క్షయ వ్యాధి, ఆడ పిల్లల సంరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా క్షయ వ్యాధి లక్షణాలు, నిర్ధారణ, ఆడ పిల్లల ప్రాధాన్యంపై కళాకారులు తమ ఆట పాటలతో ఆకట్టుకున్నారు. అనంతరం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భవాని మాట్లాడుతూ రెండు వారాల మించి దగ్గు ఉంటే తెమడ పరీక్ష చేయించుకోవాలన్నారు. వ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందులతో పాటు పోషకాహారం కోసం నెలకు రూ. 500 బ్యాంకు ఖాతాలో జమ అవుతాయన్నారు. కార్యక్రమంలో సర్పంచులు రాంనారాయణ, శివశంకర్, హెల్త్ సూపర్‌వైజర్ ప్రమీల, సిబ్బంది పాల్గొన్నారు.

'ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేయాలి'

ఆత్మకూరు, జనవరి 10: అమరచింత మునిసిపాలిటీ కేంద్రంలో ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్ కోరారు. బుధవారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ చాంద్‌పాషాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అజయ్ మాట్లాడుతూ మునిసిపాలిటీ కేంద్రంలో ఆధార్ కేంద్రం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెంటనే కేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రఘు, విష్ణు, ఆనందం, యుగంధర్ , సూరి, రాకేష్, జానకిరాములు, ఇమ్మానుయేల్, రాజు, బాలకృష్ణ పాల్గొన్నారు.

'ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి'

ఖిల్లాఘణపురం, జనవరి 10: ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పీఆర్‌టీయూటీఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్ కోరారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం పీఆర్‌టీయూటీఎస్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం మండల ప్రధాన కార్యదర్శి నాగేశ్వయ్య, సభ్యుడు శ్రీశైలం, బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సుధారాణి, ఉపాధ్యాయులు, ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీరంగాపూర్: పీఆర్టీయూ క్యాలెండర్‌ను శ్రీశ్రీశ్రీ అష్టచారి సంపత్‌కుమార్ రామానుజ స్వామి ఆవిష్కరించారు. బుధవారం శ్రీ రంగనాథస్వామి ఆలయాన్ని దర్శించడానికి వచ్చిన స్వామివారి ఉపాధ్యాయులు క్యాలెండర్‌ను ఆవిష్కరించి ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు

ఖిల్లాఘణపురం, జనవరి10: మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో కొనసాగుతున్న ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను బుధవారం ఎంపీడీవో విజయ్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని 27గ్రామపంచాయతీల్లో నిర్వహించిన ప్రజాపాలనలో 11903 దరఖాస్తులు రాగా 9185 దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు తెలిపారు.

డీటీసీపీ అనుమతి తప్పని సరి

ఆత్మకూరు, జనవరి 10: డీటీసీపీ అనుమతి లేకుండా ఇంటి స్థలం క్రయ విక్రయాలు జరపకూడదని అమరచింత మునిసిపల్ కమిషనర్ మహమ్మద్ ఖాజా బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అమరచింత పట్టణ కేంద్రంలోని నూతనంగా వెలసిన వెంచర్‌లో కొందరు రియాల్టర్లు అమాయకులను ఆసరాగా చేసుకుని ఆత్మకూరు రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేస్తున్నారని తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. 10/2, 34, 35 సర్వే నంబర్ నందు గల ప్లాట్లను మునిసిపల్ చట్టం 2019 చట్ట ప్రకారం మాత్రమే రిజిస్ట్రేషన్ జరుగాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. ప్రజలు అమాయకంగా మోసపోవద్దని సూచించారు.